క్లుప్తంగా

టెక్నాలజీపై అవగాహన అవసరం

రాజానగరం: ఆధునిక సాంకేతిక యుగంలో టెక్నాలజీ ఆవశ్యకత ఎంతో పెరిగిందని ఆదికవి నన్నయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ అన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మిషన్ లెర్నింగ్ అంశాలపై ఎస్ఆర్‌టీ సన్రైస్ టెక్ ఐకాన్ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం యూనివర్సిటీలో శిక్షణ కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మిషన్ లెర్నింగ్ వంటి టెక్నాలజీలు అందరికీ అవసరమన్నారు. యూనివర్సిటీ క్యాంపస్‌లోని అధ్యాపకులందరికీ సాంకేతిక పరిజ్ఞానం పెంచాలనే ఉద్దేశంతో వీసీ ఆచార్య కె. పద్మరాజు సూచనల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. సంస్థ సీఈఓ ఎస్‌వీడీ రవితేజ, వెంకట భమిడిపాటి మాట్లాడుతూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మిషన్ లెర్నింగ్ ప్రాధాన్యతలను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో ట్రైనింగ్ అధికారి డాక్టర్ టి. హైమవతి, అధ్యాపకులు పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షలకు సర్వం సిద్ధం



కుశలవదొర, ఎంఈవో

మధురపూడి: పదోతరగతి పరీక్షలకు కోరుకొండ మండలంలో అన్ని ఏర్పాట్లు చేశామని ఎంఈఓ టి.కుశలవదొర తెలిపారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 18న ప్రారంభమయ్యే పరీక్షలకు మండలంలో 8 కేంద్రాలను కేటాయించామని, 1,502 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవుతారన్నారు. గత ఏడాది ఆరు కేంద్రాలు ఉండగా, ప్రస్తుతం విద్యార్థుల సంఖ్య పెరిగినందున మరో రెండు కొత్తగా ఏర్పాటు చేశామని తెలిపారు. కొత్తగా కేటాయించిన గాడాల, గాదరాడ హైస్కూళ్లతో పాటు దోసాకాయలపల్లి, శ్రీరంగపట్నం హైస్కూల్స్, కోరుకొండ హైస్కూల్‌లోని ఏ, బీ సెంటర్లు, చెరుకూరి విద్యాలయంలో ఏ, బీ సెంటర్లలో పరీక్షలు జరుగుతాయన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

పెదపూడి: కాకినాడ – రామచంద్రపురం 132 కేవీ లైన్ వార్షిక మరమ్మతుల నేపథ్యంలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని కాకినాడ ఈఈ ప్రసాద్ తెలిపారు. మండలంలోని శహపురం, కాండ్రేగుల, కుమారప్రియం, కైకవోలు గ్రామాల్లో ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ విద్యుత్ ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

311 మందికి వైద్యసేవలు



రంగంపేటలో ఆరోగ్య కిట్లు అందిస్తున్న వైద్య సిబ్బంది

రంగంపేట: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను ప్రజలందరూ వినియోగించుకోవాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర చేనేత విభాగం కార్యదర్శి పాలాటి నాగేశ్వరరావు సూచించారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా పీహెచ్‌సీ ఆధ్వర్యంలో డాక్టర్ బి.వేణుశ్రీలక్ష్మి పర్యవేక్షణలో స్థానిక సచివాలయం-2 వద్ద శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యాధికారులు కె.చిన్నారావు, ఎం.వినీత, ఏబీఎస్ పవన్‌కుమార్, కంటి వైద్య నిపుణులు హాజరై 311 మందికి వైద్యసేవలు అందించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ కె.జయమణి, ఎంపీహెచ్‌ఓ పి.ప్రసాద్, పీహెచ్ఎన్ ఎల్.గంగాభవాని పాల్గొన్నారు.

గ్లకోమా వ్యాధిపై అవగాహన

రంగంపేట: గ్లకోమా వ్యాధిపై ప్రజలందరూ అవగాహన కలిగి ఉండాలని పీహెచ్‌సీ డాక్టర్ బి.వేణు శ్రీలక్ష్మి సూచించారు. ప్రపంచ గ్లకోమా వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక సచివాలయం వద్ద అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్లకోమా అనేది కళ్లకు సంబంధించిన వ్యాధి అన్నారు. దీనిని నిర్లక్ష్యం చేస్తే కంటిచూపు కోల్పోయే ప్రమాదం ఉందని తెలిపారు. ముందుగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర చేనేత విభాగం కార్యదర్శి పాలాటి నాగేశ్వరరావు, ఏఓ ఎం.ఇందిర, సీహెచ్‌ఓ కె.జయమణి, ఎంపీహెచ్‌ఈఓ పి.ప్రసాద్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

యువకుడిపై కేసు

సీతానగరం : మండలంలోని ఉండేశ్వరపురానికి చెందిన జుత్తుక సౌమ్య ఫిర్యాదు మేరకు రాజానగరం మండలం భూపాలపట్నానికి చెందిన హెచ్. వెంకట సురేష్‌పై హత్యాచారం కేసు నమోదు చేసినట్టు ఎస్సై టి.రామకృష్ణ శుక్రవారం తెలిపారు. రాజమహేంద్రవరంలో ఒక షాపులో పనిచేస్తున్న సౌమ్యతో వెంకట సురేష్ పరిచయం పెంచుకున్నాడు. ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని చెప్పి బలవంతంగా లొంగదీసుకున్నాడు. పెళ్లి గురించి అడిగే సరికీ పెద్దలు ఒప్పుకోవడం లేదని, కులాలు వేరంటూ ప్లేటు ఫిరాయించాడు. దీనిపై నార్త్‌జోన్ డీఎస్పీ కె.శ్రీనివాసరావు విచారణ చేస్తారని ఎస్సై రామకృష్ణ తెలిపారు.

వ్యక్తికి రిమాండ్

సీతానగరం: దేవీపట్నం మండలం చిన్నారిగండికి చెందిన కుజ్జుం వీరబాబు దొరను కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించారని ఎస్సై టి.రామకృష్ణ తెలిపారు. శుక్రవారం తెల్లవారుజామున వంగలపూడి శివారున వీరబాబు దొరను సారాతో తరలిస్తుండగా అదుపులోకి తీసుకుని, 100 లీటర్లు సారా స్వాధీనం చేసుకున్నామన్నారు.

ఒత్తిడిని అధిగమిస్తే విజయమే..

- 18 నుంచి టెన్త్ పరీక్షలు
- హాల్ టిక్కెట్లు చూపిస్తే ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం
- అనపర్తి నియోజకవర్గంలో 3,075 విద్యార్థులు



బిక్కవోలులో పదో తరగతి విద్యార్థులు

బిక్కవోలు: పదోతరగతి పరీక్షలు ఈ నెల 18 నుంచి ప్రారంభం కానున్నాయి. ఏడాదంతా ఎంతో ప్రణాళికాబద్ధంగా చదివిన విద్యార్థులు, తమ ప్రతిభను పేపర్లపై రాయాల్సి ఉంటుంది. టెన్త్ పరీక్షలంటే సాధారణంగా విద్యార్థులకు ఒత్తిడి ఉంటుంది. దానికి అధిగమిస్తేనే విజయం సాధ్యమవుతుంది. విద్యార్థులకు అన్ని విధాలా ఉపాధ్యాయులు సహాయపడుతూ ఒత్తిడిని దూరంగా ఉంచడానికి అనేక చర్యలు చేపట్టారు. అలాగే విద్యార్థులకు కూడా మానసికంగా, శారీరకంగా ధృడంగా ఉండాలి. ఆత్మ విశ్వాసంతో ముందుగుడు వేయాలి.

విద్యకు జగన్ ప్రాధాన్యం

జగన్ ప్రభుత్వం విద్యారంగానికి పెద్దపీట వేస్తూ, ఉత్తమ ఫలితాలు సాధించే దిశగా అడుగులు వేస్తోంది. అందుకు అనుగుణంగా విద్యాశాఖకు దిశా నిర్దేశం చేసింది. ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్కూళ్ల స్థాయి వసతులు కల్పించింది. ఫలితాలు కూడా కార్పొరేట్‌కు దీటుగానే ఉండాలని ఆకాంక్షిస్తోంది. పది పరీక్షలు అనగానే విద్యార్థుల్లో తెలియని ఆందోళన, మానసిక ఒత్తిడి మొదలవుతాయి. వాటిని తొలగించడానికి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు చొరవ చూపాలని వైద్యులు సూచిస్తున్నారు.

ఉచిత బస్సు సౌకర్యం

సాధారణంగా విద్యార్థులు వేరే ప్రాంతానికి వెళ్లి టెన్త్ పబ్లిక్ పరీక్షలు రాస్తారు. పరీక్ష రాసేందుకు కొంతదూరం ప్రయాణం చేయాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఉచితంగా ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించింది. విద్యార్థులు తమ హాల్ టిక్కెట్లను కండక్టర్‌కు చూపించి, బస్సుల్లో ఉచితంగా ప్రయాణం చేయవచ్చు. ఈ విధానం చాలామంది విద్యార్థులకు ఉపయోగంగా ఉంటుంది.

నియోజకవర్గంలో 16 కేంద్రాలు

అనపర్తి నియోజకవర్గంలోని 16 కేంద్రాల్లో 3,075 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు. వీరిలో అనపర్తి మండలం విద్యార్థులు 1,020 మంది, బిక్కవోలు మండలం 680 మంది, రంగంపేట మండలం 606 మంది, పెదపూడి మండలం 769 మంది ఉన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని పోలీసు అధికారులు తెలిపారు.

ఆరు గంటల నిద్ర అవసరం



పరీక్షల సమయంలో విద్యార్థులకు సహజంగానే ఒత్తిడి కలుగుతుంది. రోజుకు ఆరు గంటల పాటు తప్పకుండా నిద్ర పోవాలి. నిద్రలో ప్రధానమైనది గాఢ నిద్ర. ఇది 25 శాతం ఉండాలి. దీని వల్ల చదివిన అంశాలు మెదడులో నిక్షిప్తమవుతాయి. సాత్వికమైన ఆహారం తీసుకోవడం మంచిది.

– తేతలి రామారెడ్డి, మానసిక వైద్యుడు, అనపర్తి

వాహనాలు ఇవ్వొద్దు



పరీక్షల సమయంలో విద్యార్థులను వారి తల్లిదండ్రులు, సంరక్షకులే పరీక్షా కేంద్రాల వద్ద వదిలి రావడం మంచిది. విద్యార్థులకు వాహనాలను ఇవ్వొద్దు. దానివల్ల లేనిపోని ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. పరీక్షలు రాసే విద్యార్థులు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణం చేయవచ్చు. ఆ సౌకర్యాన్ని కూడా వినియోగించుకోవాలి.

– బుజ్జిబాబు, ఎస్సై, బిక్కవోలు

ఉదయం 9.30 వరకూ మాత్రమే అనుమతి



టెన్త్ పరీక్షలు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 వరకూ జరుగుతాయి. విద్యార్థులు కనీసం 8.30 గంటల కల్లా పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలి. ఉదయం 8.45 నుంచి 9.30 వరకు మాత్రమే విద్యార్థులను కేంద్రాల్లోకి అనుమతిస్తాం. 9.30 తరువాత ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతి ఉండదు.

– సీహెచ్ సత్యనారాయణ, ఎంఈవో -1, బిక్కవోలు

వలంటీర్ల సేవలు అభినందనీయం

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- పెదపూడిలో ఘనంగా సన్మానం



పెదపూడిలో ఎమ్మెల్యేను సన్మానిస్తున్న సింహాచలం, వలంటీర్లు



అనపర్తిలో లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

పెదపూడి: ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను అర్హుల చెంతకు అందజేస్తున్న వలంటీర్ల సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. పెదపూడి గ్రామంలో శుక్రవారం మండల స్థాయిలో గ్రామ వలంటీర్ల సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యేను వలంటీర్లు గజమాలతో ఘనంగా సత్కరించారు. వైఎస్సార్ సీపీ చేనేత విభాగం రాష్ట్ర కార్యదర్శి పప్పు సింహాచలం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రతి గడపకూ వలంటీర్లు అందిస్తున్నారన్నారు. ప్రజల నుంచి మన్ననలు కూడా పొందుతున్నారన్నారు. కరోనా సమయంలో వీరు అందించిన సేవలు అభినందనీయమని కొనియాడారు. గ్రామ వలంటీర్ వ్యవస్థ దేశ చరిత్రలో ఒక రికార్డుగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కేతా తులసి, జెడ్పీటీసీ సభ్యురాలు పేపకాయల వెంకటలక్ష్మి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి అద్దంకి ముక్తేశ్వరరావు, పార్టీ మండల అధ్యక్షుడు గుత్తుల రమణ, జేసీఎస్ మండల కన్వీనర్ కర్రి శ్రీవెంకటరెడ్డి, స్థానిక ఎంపీటీసీ సభ్యుడు సమ్మంగి దుర్గా ప్రసాద్, గ్రామ కన్వీనర్ మీసాల నాగరాజు, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ ప్రతినిధి కాకర సాయిబాబు, మండల రైతు విభాగం కన్వీనర్ మార్ని వెంకట్రావు, మండల చేనేత విభాగం కన్వీనర్ తిప్పాని వెంకట్రావు, మార్ని పెద్దబ్బు పాల్గొన్నారు.

కైకవోలులో రక్షిత పథకం ప్రారంభం

కైకవోలు గ్రామంలో రక్షిత తాగునీటి పథకం, ఇంటింటికి కుళాయిలను ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచి నూని పట్టాభి రామన్న చౌదరి, ఉప సర్పంచి కొప్పిశెట్టి వీరశంకర్, గ్రామ కన్వీనర్ ఎల్లే సత్తిబాబు, పార్టీ నాయకులు పంపన శ్రీను తదితరులు పాల్గొన్నారు.

280 మందికి ఇళ్ల పట్టాల పంపిణీ

అనపర్తి: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో గ్రామానికి చెందిన 280 లబ్ధిదారులకు మంజూరైన ఇళ్ల పట్టాలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం జగన్ అమలు చేస్తున్న అనేక సంక్షేమ పథకాలతో ప్రభుత్వంపై ప్రజల్లో నమ్మకం రెట్టింపైందన్నారు. దీంతో వచ్చే ఎన్నికల్లో ప్రజలు వైఎస్సార్ సీపీకి విజయాన్ని అందించి జగనన్నను ముఖ్యమంత్రిని చేయడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వారా కుమారి, పార్టీ రాష్ట్ర సేవాదళ్ కార్యదర్శి చిర్ల వీర్రాఘవరెడ్డి, పార్టీ మండల మహిళా విభాగం అధ్యక్షురాలు విజయకుమారి, ఎంపీటీసీ కొండేటి భీమేష్, పార్టీ నాయకులు పడాల వెంకటరెడ్డి, సత్తి వెంకటరెడ్డి పాల్గొన్నారు.

సత్వర న్యాయం.. లోక్ అదాలత్‌తో సాధ్యం

అనపర్తి: రాజ్యాంగం కల్పించిన హక్కులు, చట్టాలపై కనీస అవగాహన, న్యాయ విజ్ఞానం లేకపోవటంతో నేడు సమాజంలో అనేక మంది ఇబ్బందులు పడుతున్నారని అనపర్తి జూనియర్ సివిల్ జడ్జి రెడ్డి ప్రసన్న అన్నారు. శనివారం జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం జరగనున్న నేపథ్యంలో శుక్రవారం 'సాక్షి'తో మాట్లాడారు. చట్టాలు, లోక్ అదాలత్‌లు, న్యాయ విజ్ఞానం తదితర అంశాలను వివరించారు.

- సమాజంలో ప్రతి పౌరుడికీ ఉచిత న్యాయ సహాయాన్ని అందించడానికి లోక్ అదాలత్‌లు ప్రారంభించబడ్డాయి. కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసులు, కోర్టుకు రాని కేసులను సైతం వీటి ద్వారా పరిష్కరించుకునే అవకాశం ఉంది. కాలయాపన, ఫీజులు ముఖ్యంగా తక్షణ న్యాయ సహాయం పొందవచ్చు. వీటిలో లోక్ అదాలత్ చట్టం ద్వారా ఇచ్చిన తీర్పు అంతిమం. దీనికి ఏ విధమైన అప్పీలు ఉండదు. న్యాయ సేవా సంస్థ ద్వారా రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిల్లో నిర్వహించే లోక్ అదాలత్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.
- ఏదేనా సంఘటనకు సంబంధించి పోలీసులకు ఫిర్యాదు చేసినా, వారు స్పందించని పక్షంలో బాధితులు కాలయాపన చేయకుండా నేరుగా కోర్టును ఆశ్రయించవచ్చు. వివాదాలకు సంబంధించి వేగవంతమైన విచారణ, విధానంలో వెసులుబాటు లోక్ అదాలత్‌లో ముఖ్య అంశాలు. ముఖ్యంగా కేసుకు సంబంధించి లోక్ అదాల్‌లో నేరుగా న్యాయమూర్తితో సంభాషించే అవకాశం ఉంది.
- సమాజంలో మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలి. దంపతుల మధ్య తలెత్తే వరకట్నం వేధింపులకు సంబంధించి పోలీస్ స్టేషన్‌లో నేరుగా కేసులు నమోదు చేయరు. బాధితులు వరకట్న వేధింపులపై స్టేషన్‌లో కేసు పెడితే వారికి ముందుగా ఫ్యామిలీ కౌన్సెలింగ్ కేంద్రాలకు పంపుతారు. అక్కడ వాస్తవాలు నిర్ధారించుకుని వారికి అవగాహన కలిగిస్తారు. అప్పటికీ ఇద్దరి మధ్య సయోధ్య కుదరని పక్షంలో కేసు నమోదు చేస్తారు.
- ఇంటర్నెట్ వినియోగం పెరిగిన నేపథ్యంలో సైబర్ నేరాలు కూడా ఎక్కువయ్యాయి. సామాజిక మాధ్యమాల్లో అసభ్యకర రాతలు, ఎదుటి వ్యక్తి గౌరవానికి భంగం కలిగించడం, ఈ-మెయిల్‌లో మానసిక వేధింపులు, సందేశాలు, ఫొటోల మార్ఫింగ్, అశ్లీల వీడియోలు, చిత్రాలు పోస్ట్ చేయడం ఇవన్నీ సైబర్ నేరాలే. ఈ నేరాలకు పాల్పడే వారిపై వారంటు లేకుండా అరెస్ట్, నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేస్తారు.
- సాధారణంగా పౌరులు రుణాలు తీసుకునే సమయంలో ఖాళీపత్రాలు, చెక్కులు, ప్రామిసరీ నోట్లపై సంతకాలు చేస్తూ ఉంటారు. ఇలా చేయడం కారణంగా మోసానికి గురయ్యే ప్రమాదం ఉంది. న్యాయస్థానాల్లో ప్రామిసరీ నోట్లుకు సంబంధిన కేసుల ఎక్కువగా నమోదు అవుతున్నాయి. ప్రోనోట్‌ను పూరించే విషయంలో అవగాహన కలిగి ఉండాలి.

రేపటి నుంచి ఒనువులమ్మ ఆలయ వార్షికోత్సవాలు



రాజమహేంద్రవరం రూరల్: తొర్రేడు గ్రామంలోని ఒనువులమ్మ ఆలయ వార్షికోత్సవాలను ఆదివారం నుంచి ఈనెల 19వ తేదీ వరకూ అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. ఆదివారం అమ్మవారికి చండీహోమం, ప్రత్యేక పూజలు, ఆరోజు సాయంత్రం తొర్రేడు మహిళా బృందంతో భజన నిర్వహిస్తారు. 18వ తేదీ 108 మహిళలతో సామూహిక కుంకుమ పూజలు, పంచామృతాలతో అమ్మవారికి అభిషేకం, లక్ష పుష్పాలతో అమ్మవారికి అర్చన, సాయంత్రం గరగ నృత్యాలు, తీన్మార్, మేళతాళాలతో ఊరేగింపు జరుగుతుంది. 19న అమ్మవారికి విశేష పూజలు, అన్నసంతర్పణ జరుగుతుంది.

అభివృద్ధికి చిరునామా జగనన్న ప్రభుత్వం



సీతానగరంలో వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ను ప్రారంభిస్తున్న సర్పంచ్ ముత్యాలు, పార్టీ నాయకులు

సీతానగరం: అభివృద్ధికి చిరునామాగా జగనన్న ప్రభుత్వం నిలిచిందని సర్పంచ్‌ల సమాఖ్య సంఘం మండల అధ్యక్షుడు, సర్పంచ్ కోండ్రపు ముత్యాలు అన్నారు. సీతానగరం సచివాలయం -1 పరిధిలోని వైఎస్సార్‌హెల్త్ క్లినిక్‌ను పార్టీ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు పెదపాటి డాక్టర్‌బాబు, ఉప సర్పంచ్ ద్వారంపూడి రామకృష్ణ, మండల యూత్ అధ్యక్షుడు కోలా శ్రీను, జిల్లా ఎస్సీసెల్ ప్రధాన కార్యదర్శి మద్దాల కొండలరావు, గ్రామ ఆర్బీకే అధ్యక్షుడు పైల మురళీకృష్ణతో కలిసి శుక్రవారం ఆయన ప్రారంభించారు. అలాగే ఎస్సీపేటలో కమ్యూనిటీ హాల్, మండల పరిషత్ నిధులు రూ.3 లక్షలతో చేపట్టే సీతానగరం ప్రభుత్వ హైస్కూల్లో వాలీబాల్ కోర్టు, పంచాయతీ నిధులు రూ.1.50 లక్షలతో రజకుల దోబీఘాట్ వద్ద రెండు మరుగుదొడ్ల నిర్మాణానికి శంకుస్థాపనలు చేశారు. కార్యక్రమంలో వలవల సత్తిబాబు, వలవల వలీ, మట్ట శ్రీను, మట్ట కాపు, మట్ట మునియ్య, కోండ్రపు శ్రీను పాల్గొన్నారు.

రూ.1.41 లక్షలకు వేలం ఖరారు

మధురపూడి: కోరుకొండలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామివారి ఉత్సవాలు ఈనెల 19 నుంచి 25 తేదీ వరకూ జరగనున్న విషయం తెలిసిందే. ఉత్సవాల సందర్భంగా దేవస్థానంలో కొబ్బరి చెక్కలు, తలనీలాలు పోగుచేసుకోవడానికి, అలాగే పాదరక్షలను భద్రపరిచేందుకు వేలం పాటలు నిర్వహించారు. వీటి ద్వారా దేవస్థానానికి రూ.1,41,000 వచ్చినట్టు అన్నవరం దేవస్థానం పర్యవేక్షణాధికారి కె.సూర్యనారాయణ తెలిపారు. కొబ్బరి చెక్కలకు రూ.76,500, తలనీలాలకు రూ.5,500, పాదరక్షల స్టాళ్లకు రూ.59 వేలకు వేలం ఖరారైందన్నారు.

30 మంది విద్యార్థుల గైర్హాజరు

రంగంపేట: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షలు శుక్రవారంతో ప్రశాంతంగా ముగిశాయి. చివరిరోజు ఇంటర్ ద్వితీయ సంవత్సరం కెమిస్ట్రీ, కామర్స్ పరీక్షలు జరిగినట్లు పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ బి.హేమ తెలిపారు. మొత్తం 467 మంది విద్యార్థులకు 437 మంది పరీక్ష రాశారని, 30 మంది గైర్హాజరు అయ్యారన్నారు. పరీక్ష కేంద్రాన్ని ఫ్లయింగ్ స్క్వాడ్ వి.వందన లక్ష్మి, సిట్టింగ్ స్క్వాడ్ ఎస్.విజయ కుమార్, కె.ఉమాశంకర్ తనిఖీ చేశారు. డిపార్టుమెంటల్ అధికారులుగా కేవీ సర్వేశ్వరరావు, ఎ.దుర్గాప్రసాద్ వ్యవహరించారు.

బాలల పరిరక్షణపై అవగాహన సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న ప్రొటెక్షన్ ఆఫీసర్ క్రాంతిలాల్

సీతానగరం: స్థానిక వైఎస్సార్ క్రాంతిపథం స్త్రీ శక్తి భవనంలో శుక్రవారం బాలల పరిరక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. మండల సమాఖ్య అధ్యక్షురాలు కురియాల కస్తూరి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ విభాగం ప్రొటెక్షన్ ఆఫీసర్ క్రాంతిలాల్ మాట్లాడుతూ బాలలకు జీవించే హక్కు, రక్షణ పొందే హక్కు, అభివృద్ధి, పాల్గొనే హక్కు, భాగస్వామ్యపు హక్కు ఉన్నాయన్నారు. పోక్సోచట్టం, బాల్య వివాహ నిషేధ చట్టంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏపీఎం ఈ.మహాలక్ష్మి, మండల సమాఖ్య సీసీడీ రమాచక్ర, ఎస్.పేరినాయుడు, టి.లక్ష్మి, జిల్లా బాలల పరిరక్షణ విభాగం డీపీఎం అమర్ పాల్గొన్నారు.

జగన్ పాలనలో అన్ని వర్గాలకూ న్యాయం



అనపర్తిలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న సత్తి ఆదిలక్ష్మి

అనపర్తి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకూ సమన్యాయం జరిగిందని ఎమ్మెల్యే సతీమణి, వైఎస్సార్ సీపీ నాయకురాలు సత్తి ఆదిలక్ష్మి అన్నారు. స్థానిక గ్రామ సచివాలయం-4 ధరణికోట తదితర ప్రాంతాల్లో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదిలక్ష్మి మాట్లాడుతూ జగనన్న పాలన సువర్ణయుగాన్ని తలపిస్తోందని, కుల, మత, రాజకీయ భేదాలు లేకుండా అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయన్నారు. రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం జగనన్నే మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షించారు. వైఎస్సార్ సీపీ పాలనలో మంచి జరిగిందని భావిస్తే, వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఇంటింటికి వెళ్లి ప్రజలకు జగన్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించాలి



విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేస్తున్న ఉపాధ్యాయులు

రంగంపేట: పదో తరగతి విద్యార్థులందరూ క్రమశిక్షణతో చదివి ఉత్తమ ర్యాంకులు సాధించాలని ఆంగ్ల ఉపాధ్యాయుడు మునుకుట్ల శివరామకృష్ణశర్మ సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని చంద్రేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం గంటా రమణబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రణాళికలతో చదివి పది పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని ప్రత్యేక ఆహ్వానితులుగా విచ్చేసిన గ్రామ సర్పంచ్ జాస్తి వెంకట పద్మావతి సూచించారు. పరీక్షల సమయంలో ఒత్తిడిని ఎలా అధిగమించాలో ఉపాధ్యాయులు సునీల్, మాణిక్యాలరావు, హనుమంతరావు, బాపిరాజు, సత్యనారాయణమూర్తి, వీరబాబు, దుర్గాప్రసాద్, నాగలక్ష్మి, మహాలక్ష్మి, సీఆర్‌ఎంటీ ఎల్.శ్రీనివాసరాజు వివరించారు. దాతలు జాస్తి సత్యనారాయణ, హెలీనా సమకూర్చిన పరీక్ష అట్టలు, హాల్ టిక్కెట్ కవర్లు, పెన్నులు, స్కేళ్లు తదితర వాటిని విద్యార్థులకు పంపిణీ చేశారు.